ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించాలి

- అంబేడ్కర్ శిల్పంపై దాడికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఖండన
- సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో వైఎస్ జగన్ నిలిచారని వెల్లడి


అంబేడ్కర్ చిత్రపటానికి అభిషేకం చేస్తున్న మందపాటి శేషగిరిరావు, అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్ష మేరకు విజయవాడ నడిబొడ్డున నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం వద్ద జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అన్నారు. శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్ పేరును తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి శేషగిరిరావు, పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, నాయకులు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేశారంటే వ్యవస్థలు ఎంత దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల నుంచి రాష్ట్రంలో జరిగిన దారుణాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో నిలిచారని, ఆయన పేరు చెరిపేసినంత మాత్రాన ప్రజలు మరువలేరని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలను మానుకోకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. దేశానికే ఆదర్శంగా ఉండాలని మాజీ సీఎం వైఎస్ జగన్ ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున నిర్మిస్తే చూస్తూ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. వెంటనే శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైఎస్ జగన్ పేరును తిరిగి యథాతథంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, పార్టీ నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, సర్పంచి జాలాది యానాదిరావు, అంబటి వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకట సుబ్బయ్య, మూర్తిరాజు, గేరా సంజీవ్, షేక్ షర్మిల, దేవరకొండ గోపి, వట్టిప్రోలు రంగారావు, సుభాని పాల్గొన్నారు.

రేషన్ బండికి టాటా.. కష్టాలకు బాట

- ఇంటింటికీ సరకుల నిలిపివేతకు ప్రభుత్వం నిర్ణయం
- కలెక్టర్ల సదస్సులో తేల్చిచెప్పిన సీఎం చంద్రబాబు
- మళ్లీ పాత విధానంలోనే రేషన్ షాపులకు తప్పని క్యూ
- ఎండీయూ ఆపరేటర్ల ఉపాధికి పాలకుల తీరుతో గండి


ఇంటి ముందే ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న వృద్ధురాలు

ప్రత్తిపాడు: రేషన్ బండి ప్రతి ఒక్కరి ఇంటి ముందుకు వచ్చి బియ్యం ఇచ్చే రోజులకు కాలం చెల్లింది. కూటమి ప్రభుత్వం ఆ సదుపాయాన్ని పేదలకు దూరం చేసింది. సైరన్ మోగించి మరీ వీధికొచ్చిన ఎండీయూ బండి ఇక మూగబోనుంది. వృద్ధులు, వికలాంగులు, ప్రజలు ఇన్నాళ్లు రోజువారీ పనులకు ఇబ్బంది లేకుండా సరకులు తీసుకునేవారు. ఇప్పుడు పనులు మానుకొని రేషన్ షాపుల వద్దకు ఈసురోమంటూ వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చేస్తున్నాయి. గంటల తరబడి వరుసలో నిల్చోబెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీకి చంద్రబాబు కూటమి ప్రభుత్వం బైబై చెప్పింది. పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల వద్దనే ఇక నుంచి రేషన్ పంపిణీ చేయనున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 10, కాకుమాను – 9, వట్టిచెరుకూరు –11, పెదనందిపాడు – 10, గుంటూరు రూరల్ మండలంలో 19 ఎండీయూ వాహనాలున్నాయి. ఆయా మండలాల్లో 154 రేషన్ దుకాణాలు కొనసాగుతున్నాయి. దుకాణాల పరిధిలో ప్రతి నెల 1,43,870 మంది కార్డు దారులు సరకులు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి రేషన్‌ను డోర్ డెలివరీ చేసేవారు. దీంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయాయి. క్యూలైనులో నిలబడే అవసరం రాలేదు. వారి వీధిలోనే వారి ఇంటి ముంగిటనే దర్జాగా నిలబడి రేషన్ సరకులను తీసుకునేవారు. కానీ ఈ విధానానికి భారం పేరుతో కూటమి ప్రభుత్వం వీడ్కోలు పలుకుతోంది. ఆయా వాహనాలను ఎండీయూ ఆపరేటర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సబ్సిడీపై రుణాల కింద ఇచ్చింది. ఆయా రుణాలను వీరు ఈఎంఐ పద్ధతిన చెల్లించాల్సి ఉంది. నెలా నెలా ఇచ్చే జీతం నుంచి ఈఎంఐను మినహాయించుకుంటారు. ఇప్పుడు ఉన్నట్లుండి వారి వాహనాలను తొలగించి, జీవనోపాధిని తీసివేయడంతో వారి జీవితం అస్తవ్యస్తమవుతోంది. రుణం తీరక, బ్యాంకులో బకాయి అలానే ఉండిపోతుంది. ఈ కారణంగా కుటుంబం గడవడం భారం కానుంది. వాహన రుణం తీరకుంటే వారికి సొంతమయ్యే అవకాశం కూడా కనిపించడం లేదు.

క్లుప్తంగా

భోజన పథకానికి దాతల సాయం తీసుకోవాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి దాతల సహాయం తీసుకోవాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దాతల సహకారంతో విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. కొమ్మూరు గ్రామానికి చెందిన దాత గేరా రత్నం అందించిన సాయంతో విద్యార్థులకు పెరుగు, మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జి.సుధారాణి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం భవిష్యత్తుకు మార్గదర్శి



గుంటూరు రూరల్: పుస్తకం మన భవిష్యత్తుకు మార్గదర్శి అని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు జి. శాంతమూర్తి తెలిపారు. శుక్రవారం జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వతంత్ర పోరాటం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చరిత్రను పాఠశాలకు మాత్రమే పరిమితం చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో విస్మరించడం తగదన్నారు. సాంకేతికతపై దృష్టి పెట్టడం అవసరమే కానీ, అదే జీవితంగా భావించడం భావితరాల మనుగడకు ప్రమాదమని తెలిపారు. సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో వివిధ ఘట్టాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, ఉపాధ్యాయులు ఆర్.విజయకుమారి, శాంతప్రియ, ధర్మరాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



గుంటూరు మెడికల్ : ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన 'మా కే నామ్ పే ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం)లో భాగంగా శుక్రవారం బీజేపీ గుంటూరు మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణనగర్ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు మనం నాటే మొక్కలు వృక్షాలుగా మారి రేపటి తరానికి అమోఘమైన ఫలాలు, ఆరోగ్యమైన జీవితాన్ని ఇస్తాయని తెలిపారు. మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా ఉపాధ్యక్షులు వాణి వెంకట్, మహాలక్ష్మి, జిల్లా కన్వీనర్ సుకన్య, కోలా రేణుకాదేవి, జిల్లా కార్యదర్శి సరోజిని, సభ్యులు మణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ గూడూరు రాంబాబు, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్, బీజేపీ 2వ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పద్మనాభం, రాయుడు, పొన్నపల్లి సోమశేఖర్, మైలవరపు ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీసాయిరాగ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు సంగీత విభావరి మొదలవుతుందని, తనతోపాటు శిష్యురాలైన నాగసరపు నాగవెంకట లిషిత అన్నమయ్య కీర్తనలు, ప్రైవేటు భక్తి కీర్తనల్ని ఆలపించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.

12 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12నుంచి 14వరకు అన్ని గ్రామాల పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విమాదేవి శుక్రవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. 2024– 25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోపాటు ఉద్యోగావకాశాలకూ ప్రాధాన్యం


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రత్తిపాడు: విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు ఉద్యోగావకాశాలు కూడా పొందేలా నిష్ణాతులైన అధ్యాపకులతో బోధిస్తున్నట్లు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 2024–25 బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు తరగతుల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ కళాశాలలో ప్రత్యేక ఇన్నోవేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ స్థాయిలో తమ కళాశాలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేవలం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా స్వయంగా కంపెనీలు స్థాపించేందుకు అవసరమైన నైపుణ్యాలను పలు స్టార్టప్ కంపెనీల సహకారంతో అందిస్తున్నామని చెప్పారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ.. ఆధునిక పోకడలతో విద్యను నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, పరీక్షా విధానాలు, ట్రైనింగ్ క్లాసులపై వివరించారు. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, యువకులు వేసిన అదిరేటి స్టెప్పులు అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి ఎం. అంజనీ ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో జరిగే కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదకాకాని: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆలయాలు కళకళలాడాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెదకాకాని శ్రీ వరలక్ష్మి అమ్మవారి ఆలయం రద్దీగా మారింది. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకుమాను: మండలంలో మరమ్మతుల కారణంగా అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ సాయి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

24 నుంచి చిరుధాన్యాల ప్రాధాన్యతపై సదస్సు

గుంటూరు రూరల్: రైతునేస్తం ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్, కర్షక సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆహార నిపుణులు డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ సరళాఖాదర్‌లు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో చిరుధాన్యాలతో జీవన సిరిపై మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ వేదికగా ఈ నెల 24, 25, 26వ తేదీలలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 97053 83666, 70939 73999 ఫోను నెంబర్లలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

లాలాపేట ఎస్‌హెచ్‌వోగా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పట్నంబజారు: లాలాపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఏ. శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా అనేక ప్రాంతాల్లో పని చేశారు. 2012లో సీఐగా పదోన్నతి లభించింది. అనంతరం అరండల్‌పేట, సీసీఎస్, నర్సరావుపేట, కోవూరు, సీసీఎస్, పీసీఆర్, అమరావతి ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌వో బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో లాలాపేట ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తెలిపారు. ముఖ్యంగా గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

ఫోను మాట్లాడుతూ డ్రైవింగ్ ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎంవీఐ టి.రాఘవరావు

ప్రత్తిపాడు: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని తెనాలి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు అన్నారు. మండల పరిధిలోని యనమదల కిట్స్ అక్షర్ కళాశాలలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు హాజరయ్యారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌తోపాటు రహదారి చట్టాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన యువతీయువకులు డ్రైవింగ్ లైసెన్సు తీసుకున్న తరువాత మాత్రమే వాహనాలు నడపాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం వల్ల అనేక మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. అందరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి తల్లితండ్రులకు శోకాన్ని మిగల్చవద్దని సూచించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. అమృతరాణి మాట్లాడుతూ.. ట్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రామకోటయ్య, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ చర్యలకు ఖండన


పెదకాకాని సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదకాకాని: దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు పేర్కొన్నారు. క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదకాకానిలో నిరసన తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నన్నపనేని శివాజీ, పి.సత్యనారాయణ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ చట్టాలను తెచ్చిందన్నారు. పలు సంఘాల పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా ఈ చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. తిరిగి అమలు చేసే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరల కోసం గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం లాభాలను ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సాంబయ్య, కె.సత్యనారాయణ, శివయ్య, నాగేశ్వరరావు, దేవిద్రాజు, శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పాటిబండ్ల దేవిద్రాజు, రామిశెట్టి శ్రీనివాసరావు, దర్శి లింగారావు, బట్టు నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి వివరిస్తున్న జ్యోతిరాణి తదితరులు

ప్రత్తిపాడు: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్– మినీ వర్కర్స్ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయనకు తమ సమస్యలను వివరించారు. అంగన్‌వాడీలకు మెడికల్ లీవ్‌లు, ఉద్యోగ విరమణ పొందిన వర్కరు,హెల్పర్లకు పెన్షన్ ఇప్పించాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ విభాగంలో గుర్తించాలని కోరారు. పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా ఆలకించిన ఎమ్మెల్యే.. పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పినట్లు టి.జ్యోతిరాణి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాష్ట్ర ట్రెజరర్ కొల్లా అనిత, కమిటీ సభ్యులు యు.జ్యోతి, అంజన, విజయలక్ష్మి, రమాదేవి, భవాని, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రతినిధులు ఉన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో అతిథులు

ప్రత్తిపాడు: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రొఫెసర్ ప్రాసమణి 'అన్నదాత మణి'లు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ.. తమ కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను మహిళలు ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఇస్తామన్నారు. ప్రొఫెసర్ ప్రాసమణి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని తల్లితండ్రుల కష్టాన్ని గుర్తుపెట్టుకొని నిరంతరం క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే గురువుల బోధనలను ఆచరించాలని తన ప్రాసల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ జె. అప్పారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జె. కిషోర్‌బాబు, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో వర్క్‌షాప్


అతిథిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: నగర శివారు లాం లోనున్న చలపతి ఫార్మసీ కళాశాలలో యాంటీ మైక్రోబయల్ స్టివార్డ్‌షిప్, క్లినికల్ అప్రైజల్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గుంటూరు సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. యాంటిబయోటిక్స్ సద్వినియోగంపై అవగాహన పెంచారు. చిన్న వ్యాధికి కూడా విరివిగా వినియోగించటం సరికాదన్నారు. వైద్యుని సలహా మేరకు వాడాలని సూచించారు. ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియంకేరి మాట్లాడుతూ.. యాంటిబయోటిక్స్ గుణాలు, వాటి ప్రత్యేకతలు వివరించారు. ఫార్మా డీ విద్యార్థులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ డీన్ డాక్టర్ కె.పరమేశ్వరి, క్వినిలియారాణి, డాక్టర్ జె.గౌతమ్‌కుమార్, డాక్టర్ నాగదుర్గ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తదితరులు అతిథులను ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎయిడ్స్, క్షయ నియంత్రణ మండలి ఇటీవల జిల్లాస్థాయిలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు కె.రాజ్‌కుమార్, ఎస్‌కే మెహబూబ్ సుభానీ ప్రథమ స్థానంలో నిలిచి, రూ.ఐదువేల నగదు బహుమతి అందుకున్నట్లు చెప్పారు. చదువుతో పాటు మానసిక వికాసాన్ని కలిగించే ఇటువంటి పోటీల్లో ప్రతి విద్యార్థీ పాల్గొనాలని సూచించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్నిన కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, వాసవీ విద్యానిధి కమిటీ కార్యదర్శి పోలిశెట్టి నాగ సుందరం, కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి జె.వి. సుధీర్‌కుమార్ అభినందించారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



తాడేపల్లి రూరల్: హైకోర్టు నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్‌ను, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలని తాడేపల్లి యస్ఐ రమేష్ సూచించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి వద్ద శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 90 శాతం మంది తలకు హెల్మెట్టు లేక తీవ్ర గాయమై మరణించిన వారేనని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారికి హెల్మెట్ కవచం లాంటిదని, నిరంతరం దాన్ని వెంటే ఉంచుకోవాలని ఆయన సూచించారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి


సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తెనాలి అర్బన్: ఎస్సీ వర్గీకరణను పూర్తిగా రద్దు చేయాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని ఎస్సీ ఉపవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా ఎస్సీ ఉపవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల ఆధ్వర్యంలో కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల్లో క్రిమిలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాడమి తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఎస్సీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను వినతిపత్రం ఇచ్చారు.